


# ఇన్సూరెన్స్ పాలసీలనూ సమీక్షించండి

## అవసరాలకు తగ్గ ప్లాన్లతోనే రక్ష

ఆరోగ్య, జీవిత బీమాలు ఈ రోజుల్లో తప్పనిసరైపోయాయి. ప్రస్తుత పరిస్థితుల్లో దాదాపు అందరూ వీటికే మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నారు. అయినప్పటికీ దేశంలో ఇన్సూరెన్స్ తీసుకునేవాళ్ల సంఖ్య ఇప్పటికీ 1 శాతానికి లోపే ఉందంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 4 శాతం సగటుతో పోల్చినా మనం ఎక్కడో ఉన్నాం. అయితే వార్షికంగా 15 శాతం వరకూ వృద్ధిని సాధిస్తున్నామనే చెప్పాలి. అయినా ఇంకా లక్ష్యాలు చాలా దూరంలోనే ఉన్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

**అర్థవంతమైన పాలసీల కోసం..**

సాధారణంగా ప్రతీ 2-3 నెలలకోసారి మనం మన ఈక్విటీ పోర్ట్‌ఫోలియోను సమీక్షించుకుంటూ ఉంటాం. స్టాక్స్ అయితే నిత్యం వాటిని ఓ కంట కనిపెడ్తూనే ఉంటాం. నెట్‌వర్త్‌ను కూడా ఏడాదికోసారైనా సరిచూసుకుని మన ఆస్తులు-అప్పుల స్థితిగతులేంటో ఓ అంచనాకు వస్తాం. కానీ హెల్త్, లైఫ్ పాలసీల విషయంలో అలాంటి జాగ్రత్తలు, సమీక్షలు చేసుకుంటున్నామా? లేదా? అనేది ప్రధానంగా మనం గమనించాల్సిన అంశం. ఒకసారి ఏదో పాలసీ తీసుకున్నాక, ఇక అవసరాలు పెరిగినా.. తగ్గినా.. వాటితో సంబంధం లేకుండా పాత వాటినే కొనసాగించడం వల్ల అర్థం లేదు. ఏదైనా అవసరం వచ్చినప్పుడు అవి అక్కరకు కూడా రావు. పెరుగుతున్న వయస్సు, బాధ్యతలు, అప్పులు.. ఇలా చాలా అంశాలను మనం ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ రకంగా సమీక్షలు జరిపితేనే అర్థవంతమైన పాలసీలను అందుకోగలం.

**హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీపై..**

ఉద్యోగంలో చేరిన కొత్తలో ఏ రూ.2 లక్షలకో, రూ.3 లక్షలకో పాలసీని తీసుకుని ఉంటాం. కానీ ముమ్మందు కుటుంబం పెరుగుతుంది. పిల్లలు వచ్చి చేరతారు, వాళ్లు పెద్ద వారవుతారు. మీకూ వయస్సు పెరుగుతూ ఉంటుంది. అనారోగ్యాలు ఏవైనా కొత్తగా చుట్టుముట్టొచ్చు. కాబట్టి మనం మొదట్లో తీసుకున్న హెల్త్ కవరేజీ ఇప్పుడున్న పరిస్థితుల్లో సరిపోతుందా? అనేది ముఖ్యం. మెట్రో నగరాల్లో ఉన్నవాళ్లకు ఈ రోజుల్లో కనీసం రూ.10 లక్షలకు తక్కువగా కవరేజీ ఉన్నా ఉపయోగం లేదనిపిస్తోంది. 35 ఏండ్లు దాటి, నగరాల్లో ఉంటూ, ఇద్దరు పిల్లలుండి.. ఒకే ఆదాయంపై కుటుంబాన్ని పోషిస్తున్న పెద్దకు రూ.12-15 లక్షల వరకూ హెల్త్ కవరేజీ తప్పనిసరి. ఎందుకంటే వయస్సు పైబడుతున్నప్పుడు, ఏదైనా అనారోగ్యం వచ్చినప్పుడు, పదేపదే క్లెయిమ్స్ తీసుకుంటున్నప్పుడు కంపెనీలు మన కవరేజీని పెంచుకోవడానికి నిరాకరించే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. అందుకే మన అవసరాన్ని ముందే గుర్తించి వయస్సు, అనారోగ్యాల విషయంలో పాలసీ కవరేజీని పెంచుకోవడం ఉత్తమం. ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలు తీసుకోండి. ఇక నో క్లెయిం బోనస్‌లు (ఎన్‌సీబీ) వస్తున్నాయి కదా అని పాలసీ కవరేజీ పెంచుకోకపోతే ఏమవుతుంది అనుకోవద్దు. ఒకసారి ఎప్పుడైనా క్లెయిమ్ ఉపయోగిస్తే.. అంతవరకూ అక్యుములేట్ అయిన బోనస్ మొత్తం పోయి మీ బేస్ కవరేజీ మాత్రమే మిగులుతుంది. అయితే ఎన్‌సీబీ విషయంలో కొన్ని కంపెనీల విధానాలు వేరుగా ఉన్నాయి. క్లెయిం పెట్టుకున్నాసరే అంతదాకా ఉన్న బేస్ కవరేజీ, బోనస్‌లను కొనసాగిస్తున్నాయి. అయితే ఇప్పుడున్న కంపెనీ వివిధ ఇతర కారణాలతో బేస్ కవరేజీని పెంచడానికి సిద్ధంగా లేకపోతే టాప్ అప్ పాలసీలు, సూపర్ టాప్‌అప్‌లు తీసుకోవచ్చు. వీటి ధర కూడా కాస్త తక్కువే ఉంటుంది.

**టర్మ్ ఇన్సూరెన్స్ తగ్గించుకోవచ్చా?**

మీరు వయస్సులో ఉన్నప్పుడు, బాధ్యతలు ఎక్కువగా ఉన్నప్పుడు మీ రిస్క్ ప్రొఫైల్ కూడా ఎక్కువే ఉంటుంది. ఆ సమయంలో తప్పకుండా టర్మ్ ఇన్సూరెన్స్ ఎక్కువే ఉండాలి. దాన్ని కూడా పెంచుకుంటూ పోవాలి. పెండ్లి, పిల్లలు, గృహ రుణం, కార్ లోన్, పర్సనల్ లోన్స్.. ఇలా వీటి సంఖ్య పెరిగేకొద్దీ, మీపై బరువు బాధ్యతలు పెరుగుతూ పోతాయి. కాబట్టి టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజీని కూడా తప్పక పెంచుకోవాల్సిందే. ఏదో రూ.4-5 లక్షలకు ఎల్ఐసీ పాలసీ తీసుకున్నాం కదా చాల్లే అనుకుంటే ఏదైనా అనుకోని ఘటన జరిగినప్పుడు కుటుంబం ఇరుకున పడుతుంది. కావున టర్మ్ ఇన్సూరెన్స్‌ను తగ్గించుకోవాలన్న ఆలోచననే మదిలోకి రానివ్వకండి. పాలసీ ఎంత ఎక్కువగా ఉంటే మనం దూరమైనప్పుడు మన కుటుంబాలకు అంతగా కష్టాల్ని తగ్గించినవారమవుతాం.

-నాగేంద్రసాయి కుందవరం




*మీరు కొత్త కారు లేదా బైక్ కొంటున్నారా? అయితే వాటికి ఇన్సూరెన్స్ ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించండి. తగిన ఇన్సూరెన్స్ కవరేజ్‌ను, సరైన జనరల్ ఇన్సూరెన్స్ ప్రొవైడర్‌ను ఎంచుకోవడంలో పొరపాటు చేస్తే వాహనానికి ఏదైనా జరిగినప్పుడు మీ సొంత ఖర్చులు తడిసిమోపెడవుతాయి జాగ్రత్త!*

# ఈ తప్పులొద్దు

**కొత్త వాహనాల బీమా సమయంలో జరిగే కాస్ట్‌లీ మిస్టేక్స్ ఇవి..**

1. **సరైన ఐడీవీని ఎంచుకోకపోవడం:** వాహనానికి డ్యామేజి జరిగినా, చోరీకి గురైనా ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించే గరిష్ఠ మొత్తాన్ని ఇన్సూరెన్స్ డిక్లేర్డ్ వాల్యూ (ఐడీవీ)గా వ్యవహరిస్తారు. ఈ విలువకు తగినట్టే ప్రీమియం ఉంటుంది. ప్రీమియంలను తగ్గించుకోవాలన్న ఉద్దేశ్యంతో తక్కువ ఐడీవీని ఎంచుకుంటే నష్టమే.
2. **ప్రాథమిక అంశాల్ని శోధించకపోవడం:** వాహన ఇన్సూరెన్స్ పాలసీని లేదా అది అందించే సంస్థను ఎంపికచేసుకునే ముందు ప్రాథమిక అంశాల్ని పరిశోధించి తెలుసుకోకపోవడం చాలామంది చేసే పొరపాటు. వివిధ సంస్థలు అందిస్తున్న పాలసీలు, వాటి ఫీచర్లు, క్లెయిం సెటిల్‌మెంట్ రికార్డులు వంటివి చూడాలి.
3. **పాలసీలను పోల్చిచూడకపోవడం:** ఇన్సూరెన్స్ సంస్థల్ని రీసెర్చ్‌చేసి వాటి తీరుతెన్నుల్ని గ్రహించడంతోపాటు వివిధ పాలసీలను పోల్చిచూసుకోవాలి. ఆలోచన లేకుండా ఆటోమాటిక్‌గా లభించే పాలసీని, చౌకగా లభించే పాలసీని ఎంచుకోవద్దు. నిర్ణయం తీసుకోవడానికి తగిన సమయం వెచ్చించాలి. కవరేజీ ఎంపికలో ప్రీమియం ధరలమీదే దృష్టిపెట్టకండి.
4. **ఎన్‌సీబీని ఉపయోగించుకోకపోవడం:** ఒక పాలసీ సంవత్సరంలో ఎటువంటి క్లెయింలు చేయకపోతే ఇన్సూరెన్స్ కంపెనీలు నో-క్లెయిం బోనస్ (ఎన్‌సీబీ)ను ఆఫర్ చేస్తుంటాయి. క్లెయింలు లేని సంవత్సరాలకు, జాగ్రత్తగా డ్రైవ్ చేస్తున్నందుకు రివార్డుగా సంస్థలు ప్రీమియంపై డిస్కౌంట్లు ఇస్తుంటాయి. అటువంటి ఎన్‌సీబీలను వాడుకోకుండా, బదిలీ చేసుకోకుండా పలువురు ఇన్సూరెన్స్ సంస్థల్ని తరచూ మార్చేస్తుంటారు. మీ కారు లేదా బైక్ ప్రీమియంలపై గరిష్ఠ ఆదా పొందేందుకు ఇన్సూరెన్స్ సంస్థను మార్చేటపుడు మీ ఎన్‌సీబీతో క్లెయింలు లేని సంవత్సరాల్ని అనుసంధానించండి. దీంతో మీకు దీర్ఘకాలిక వ్యయాలు గణనీయంగా తగ్గుతాయి.
5. **యాంటీ-థెఫ్ట్ డివైజ్‌లను అమర్చకపోవడం:** బద్ధకంతోనో, ఖర్చవుతుందనో చాలా మంది వాహనాల్లో యాంటీ-థెఫ్ట్/సెక్యూరిటీ డివైజ్‌లను ఇన్‌స్టాల్ చేసుకోరు. దీంతో మీ వాహనం చోరీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మీరు జీపీఎస్ ట్రాకర్లు, ఇంజిన్ ఇమ్మొబిలైజర్లు, గేర్‌లాక్స్ తదితర సెక్యూరిటీ డివైస్‌లు అమర్చుకుంటే వాహనం చోరీ కాకపోవడంతో పాటు మీ ప్రీమియం చెల్లింపులపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లు కూడా లభిస్తాయి.

## ఆది నుంచే ఆర్థిక క్రమశిక్షణ

పిల్లలకు చిన్న వయస్సు నుంచే ఆర్థిక క్రమశిక్షణను అలవాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు పడుతాయని అంటున్నారు. ముఖ్యంగా పిల్లలు వారి తల్లిదండ్రులను, ఇంట్లోని పెద్దలను చూస్తూ పెరుగుతారు కాబట్టి.. ఈ విషయంలో పెద్దలూ వివేకంతో మెదలాలని చెప్తున్నారు. కాగా, బ్యాంకింగ్ లావాదేవీలు, పెట్టుబడులు, ఆదాయ-వ్యయాలపట్ల అవగాహన పెరిగేలా పిల్లలను గైడ్ చేయాల్సిన అవసరం ఉన్నది. ఏది అవసరం, మరేది అనవసరమో వారికి తెలిసేలా చెప్పాలని, ఈ సమయంలో విసుక్కోకుండా వివరించాలని ఆర్థిక నిపుణులు



పేర్కొంటున్నారు. ప్రతీదాని విలువ తెలుసుకునేలా వారిలో ఆసక్తిని పెంపొందిస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి. ముఖ్యంగా దగ్గరుండి గమనిస్తూ వారికి సొంతంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలనూ ఇవ్వాలంటున్నారు. దీంతో వారిలో నాయకత్వ లక్షణాలనూ పెంపొందించినట్టవుతుంది.

## శాంటాక్లాజ్ ర్యాలీనా? కన్సాలిడేషనా?

గతవారం నిఫ్టీ 21,593 పాయింట్ల రికార్డుస్థాయిని తాకింది. వెనువెంటనే 21,076 పాయింట్ల కనిష్ఠస్థాయికి పతనమయ్యింది. అటుతర్వాత కోలుకుని 21,349 పాయింట్ల వద్ద ముగిసింది. వారం మొత్తంమీద 107 పాయింట్ల నష్టాన్ని చవిచూసింది. ఈ వారం ట్రెండ్‌పై విశ్లేషకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. డిసెంబర్ డెరివేటివ్ కాంట్రాక్టులు ముగియనుండటం, సోమవారం క్రిస్మస్ సెలవు అయినందున ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకావడం, గత వారం మార్కెట్లో ఒడిదుడుకులు పెరగడం వంటి అంశాల నేపథ్యంలో నిఫ్టీ పరిమితశ్రేణిలో కన్సాలిడేట్ అవుతుందని ఈక్విటీరీ




సెర్చ్.ఆసియా వ్యవస్థాపకుడు మిలన్ వైష్ణవ్, చార్ట్‌ఎనలిటిక్స్ ఫౌండర్ ఎం చద్దా అంచనావేశారు. గత 20 ఏండ్ల ట్రేడింగ్ చరిత్ర ప్రకారం శాంటాక్లాజ్ ర్యాలీ జరగవచ్చని సామ్కో సెక్యూరిటీస్ సీఈవో జిమిత్ మోది చెప్పారు. డిసెంబర్ చివరి ఐదు రోజులు, జనవరి తొలి రెండు రోజుల్లో మార్కెట్ పెరిగితే దానిని శాంటా ర్యాలీగా వ్యవహరిస్తారు.

**కీలక మద్దతు 21,000**

ఈ వారం నిఫ్టీకి 21,000 వద్ద పటిష్ఠమైన మద్దతు లభిస్తున్నదని, ఆ దిగువన 20 రోజుల ఎస్ఎంఏ రేఖ కదులుతున్న 20,830 స్థాయి వద్ద మద్దతు ఉన్నదని జిమిత్ మోది విశ్లేషించారు. 21,600 నిరోధాన్ని అధిగమిస్తే 21,750-21,800 వరకూ పెరగవచ్చన్నారు. 21,490, 21,600 స్థాయిలు అవరోధాన్ని కల్గించవచ్చని, 21,100, 21,950 స్థాయిలు మద్దతును అందిస్తాయని మిలన్ వైష్ణవ్ అంచనా వేశారు.



దాసరి కిరణ్ కుమార్ , రోజా, రామ్‌గోపాల్ వర్మ

## జగన్‌కు ఫేవర్‌గానే 'వ్యూహం' తీశాను

ఏపీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి రాజకీయ జీవితంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ రూపొందించిన చిత్రం 'వ్యూహం'. అజ్మల్, మానస ప్రధాన పాత్రధారులు. దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను ఆదివారం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ 'రాజకీయాల్లో వున్న వ్యక్తులు బయటకు ఎలా కనిపిస్తారు? సమయం వచ్చినప్పుడు ఎలాంటి కుట్రలు, వ్యూహాలను అమలు చేస్తారు? అనే అంశాలను సైకలాజికల్ కోణంలో విశ్లేషించి ఈ సినిమా తీశాను. నేను రాజకీయాల్లో లేకున్నా..రాజకీయ నాయకుల మనస్తత్వాన్ని బాగా అర్థం చేసుకోగలను. మనకళ్ల ముందు జరుగుతున్న సంఘటనలనే ఈ సినిమాలో చూపించాను. పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ పెట్టినప్పుడు నేను కూడా ఇంప్రెస్ అయ్యాను. కానీ ఆయన తీసుకున్న రాజకీయ నిర్ణయాలు చూసి అభిమానం పోయింది. పవన్‌కల్యాణ్ కొందరి చేతిలో కీలుబొమ్మగా మారాడు. నేను వైసీపీ పార్టీ మనిషినని అందరూ అంటున్నారు. నిజమే..జగన్‌కు ఫేవర్‌గానే ఈ సినిమా ఉంటుంది' అన్నారు. రాజకీయ సంఘటనల వెనకున్న తెలియని నిజాలను రామ్‌గోపాల్‌వర్మ ధైర్యంగా ఈ సినిమాలో చూపించాడని నిర్మాత దాసరి కిరణ్ కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి రోజాతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రేక్షకులతో కలిసి చూస్తా

ఆ మధ్య కాస్త నిదానించిన నిత్యామీనన్ గత ఏడాది 'తిరు' సినిమాతో మళ్లీ జూలు విదిల్చింది. అటు తమిళంలో, ఇటు తెలుగులో మంచి హిట్ అందుకుంది. దాదాపు తన కెరీర్ ముగిసిందని అందరూ అనుకుంటున్న సమయంలో వచ్చిన 'తిరు' నిత్యామీనన్‌కి మళ్లీ పెద్ద బ్రేక్‌గా నిలిచిందని చెప్పక తప్పదు. ఆ తర్వాత 'కుమారి శ్రీమతి' వెబ్‌సిరీస్ కూడా తనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం తమిళంలో జయం రవి హీరోగా తను నటిస్తున్న చిత్రం 'కాదలిక్క నేరమిల్లై'. 60ఏళ్ల క్రితం ఇదే పేరుతో తమిళంలో ఓ చిత్రం రూపొందింది. ఆ సినిమా ఇప్పటికీ అక్కడ క్లాసిక్. ఆ పేరుతో ఇప్పుడు సినిమా చేయడం అంటే నిజంగా సాహసమే. ఉదయ్‌నిధి స్టాలిన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆయన భార్య కిరుతిగ ఉదయ్‌నిధి దర్శకురాలు. ఈ సినిమా గురించి నిత్యామీనన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'మణిరత్నం 'ఓకే కణ్మని' తర్వాత నేను చేస్తున్న పూర్తిస్థాయి ప్రేమకథ ఇది. ఇందులో పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. కురితిగ అద్భుతమైన దర్శకురాలు. తను నా పాత్రను తీర్చిదిద్దిన తీరు అద్భుతం. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేశాం. బహుశా సమ్మర్‌లో విడుదల ఉండొచ్చు. నేను మాత్రం ప్రేక్షకుల మధ్యలో కూర్చొని ఈ సినిమా చూస్తా' అని చెప్పుకొచ్చింది నిత్యామీనన్



చిత్రం



## నిరర్థకమైన ఆస్తుల్ని అమ్మేసే పనిలో..

*ఒక్కోసారి ఎటువంటి ఇబ్బందులూ లేకపోయినా ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతుంటాయి. శ్రీదేవి తనయ జాన్వీకపూర్‌కి ఇప్పుడు అలాంటి పరిస్థితే తలెత్తింది. ముంబయిలోని ఖరీదైన ప్రాంతమైన ఆంధేరీలో జాన్వీకీ, ఆమె చెల్లెలు ఖుషీకీ, ఆమె తండ్రి బోనీ కపూర్‌కి ఉమ్మడి ఆస్తిగా నాలుగు ఫ్లాట్స్ ఉన్నాయి. వాటిని శ్రీదేవి ఫ్యామిలీ 12కోట్ల రూపాయాలకు అమ్మేసింది. వీటిలో 1870 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన రెండు ఫ్లాట్స్‌ని సిద్దార్థ్ నారాయణ్, అంజు నారాయణ్ అనే వ్యక్తులు దక్కించుకోగా, 1614 చదరపు అడుగుల విస్తీర్ణం గల మరో రెండు ఫ్లాట్స్‌ని ముస్కాన్ బహిర్వాణి, లలిత్ బహిర్వాణీ దక్కించుకున్నారు. నిరర్థకంగా పడివున్న ఆస్తులను వదిలించుకునే క్రమంలో ఈ ఖరీదైన ఆస్తుల్ని కూడా అమ్మేసుకున్నారు శ్రీదేవి కుటుంబసభ్యులు. త్వరలో ముంబయ్‌లోనే ఖరీదైన భవంతి కొనే ఆలోచనలో జాన్వీ ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్‌లో హవా సాగిస్తున్నది. అంతేకాక, తెలుగులో కూడా అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఉంది. కొరటాల శివ దర్శకత్వంలో తారక్ హీరోగా రూపొందుతున్న 'దేవర'లో జాన్వీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.*

## మంగళూరులో 'భీమా'



గోపీచంద్

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భీమా'. ఏ.హర్ష దర్శకత్వంలో శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధా మోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ ఆదివారం నుంచి మంగళూరులో మొదలైంది. హీరో గోపీచంద్‌తో పాటు ఇతర ముఖ్య తారాగణం పాల్గొంటున్నారు. మంగళూరులోని దట్టమైన అడవిలో ఓ పాటతో పాటు యాక్షన్ ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఫ్యామిలీ ఆడియెన్స్‌ను మెప్పించే అన్ని అంశాలుంటాయి. అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కిస్తున్నాం. గోపీచంద్ పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె గౌడ, సంగీతం: రవి బస్రూర్, సంభాషణలు: అజ్జు మహంకాళి, దర్శకత్వం: ఏ. హర్ష.

## గుండె గల్లంతే..



కావ్య థాపర్, రవితేజ

*రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని రెండో గీతం 'గల్లంతే..' ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆదివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. మనసుకు హత్తుకునే మెలోడీగా ఈ పాట సంగీత ప్రియులను అలరిస్తుందని, ప్రణయ భావాలకు అద్దం పడుతుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో రవితేజ భిన్న కోణాలున్న పాత్రలో కనిపిస్తాడని, యూనిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని నిర్మాత పేర్కొన్నారు. అనుపమ పరమేశ్వరన్, నవదీప్, శ్రీనివాస్ అవసరాల, మధుబాల, ప్రణీత పట్నాయక్, అజయ్‌ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ ఘట్టమనేని, కమిల్ ప్లాకి, కర్మ్ చావ్లా, సంగీతం: డేవ్ జాంద్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎడిటింగ్, దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని.*

